RNI No. APTEL/2010/ 36692 AKSHARA PRAKASAM aksharaprakasam@gmaiil.com

అక్షర ప్రకాశం

Published From Prakasam People News Paper

సంపుటి : 15 సంచిక : 299 సెప్టెంబర్ 16 బుధవారం 2026 ప్రకాశం పేజీలు : 4 వెల - 2

ఆళ్ల నాని హఠాన్మరణంపై

ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందన

- ఆయన మృతిపై సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి

- 56 ఏళ్లకే గుండెపోటుతో మరణించడం బాధాకరమన్న సీఎం

- ఆళ్ల నాని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపిన చంద్రబాబు

- విశాఖలో గుండెపోటుతో కన్నుమూసిన ఆళ్ల నాని

అమరావతి, సెప్టెంబర్ 15 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి, టీడీపీ నేత ఆళ్ల నాని (కాళీ కృష్ణ శ్రీనివాస్) అకాల మరణం పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కేవలం 56 సంవత్సరాల వయసులోనే గుండెపోటుతో ఆళ్ల నాని దూరమవడం తనను తీవ్రంగా కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ మేరకు చంద్రబాబు సోషల్ మీడియా వేదికగా తన సంతాప సందేశాన్ని పంచుకున్నారు. ఆళ్ల నాని గారి ఆత్మకు శాంతిని చేకూర్చాలని ఆ భగవంతుడిని కోరు కుంటున్నానని తన పోస్టులో పేర్కొన్నారు. కాగా, ఆళ్ల నాని ఇవాళ విశాఖపట్నంలో గుండెపోటుకు గురై హఠాత్తుగా కన్నుమూసిన విషయం తెలిసిందే.

ఆయన మృతి వార్త తెలియగానే రాజకీయ వర్గాల్లో విషాదం నెలకొంది. పలువురు రాజకీయ నాయకులు ఆయన మరణం పట్ల సంతాపం ప్రకటిస్తూ, ఆయన కుటుంబానికి సానుభూతి తెలియజేస్తున్నారు. సౌమ్యుడు, వివాదరహితుడైన నేతగా ఆళ్ల నానికి గుర్తింపు ఉంది.

అంతరిక్షంలో అమెరికా ఆయుధాలు

తొలిసారి బహిరంగ ప్రకటన

అంతరిక్షంలో తమ వద్ద ఆయుధాలు ఉన్నాయని అమెరికా తొలిసారి బహిరంగంగా ప్రకటించింది. ఇప్పటికే కొన్ని 'స్పేస్ కంట్రోల్ వెపన్స్' కక్ష్యలో ఉన్నాయని అమెరికా స్పేస్ ఫోర్స్ వెల్లడించింది. శత్రు దేశాల దాడుల నుంచి అమెరికా, మిత్రదేశాల బలగాలను రక్షించేందుకే వీటిని మోహరించినట్లు తెలిపింది. అయితే ఆయుధాల సంఖ్య, వాటి స్థానం, ఏ తరహా వ్యవస్థలను ఉపయోగిస్తున్నారన్న వివరాలను మాత్రం వెల్లడించలేదు. అమెరికా ఎయిర్‌ఫోర్స్ కార్యదర్శి ట్రాయ్ మెయింక్ కూడా ఈ విష యాన్ని ధ్రువీకరించారు. అమెరికా సాయుధ బలగాలపై శత్రు దేశాల నుంచి ఎదురయ్యే ముప్పులను ఎదు ర్కొనే సామర్థ్యాలను మరింత పెంచు తున్నామని చెప్పారు. ప్రస్తుతం కక్ష్యలోనే శత్రు చర్యలను ఎదుర్కోగల అంతరిక్ష ఆయుధాలు ఉన్నాయని స్పష్టంచేశారు. ఈఆయుధాలు 'కైనె టిక్, నాన్-కైనెటిక్' విధానాల్లో పని చేయగలవని స్పేస్ ఫోర్స్ తెలిపింది.

నేడు నెల్లూరు జిల్లాకు మంత్రి లోకేశ్

- పలు కార్యక్రమాలకు శ్రీకారం

- నెల్లూరు నగరంలో ఆధునికీకరించిన రెండు ప్రభుత్వ పాఠశాలల ప్రారంభోత్సవం

- కోవూరులో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్న లోకేశ్

- కోవూరు నియోజకవర్గ టీడీపీ నేతలు, కార్యకర్తలతో సమన్వయ సమావేశం

అమరావతి, సెప్టెంబర్ 15 : రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ రేపు (సెప్టెంబర్ 16) నెల్లూరు జిల్లాలో పర్యటించను న్నారు. ఒకే రోజు రెండు నియో జకవర్గాల్లో ఆయన పలు అభి వృద్ధి, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఇందుకు సంబంధించిన అధికారిక షెడ్యూల్ వివరాలు విడుదలయ్యాయి. పర్యటనలో భాగంగా తొలుత ఉ దయం నెల్లూరు సిటీ నియోజకవర్గానికి చేరుకుంటారు. ఉదయం 10 గంటలకు స్టోన్ హౌస్ పేటలోని ఆర్ఎస్ఆర్ ప్రభుత్వ పాఠశాల ఆధునీకరణ పనులను, 11:10 గంటలకు మూలపేటలోని డీఎస్ఆర్ ప్రభుత్వ పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో ముచ్చటించే అవకాశం ఉంది. మధ్యాహ్నం కోవూరు నియోజకవర్గంలో పర్యటన కొనసాగుతుంది. 12:15 గంటలకు కోవూరు పట్టణంలోని నెల్లూరు బైపాస్ వద్ద ఏర్పాటు చేసిన స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు చెన్నై-విజయవాడ హైవే వద్ద ఏర్పాటు చేసిన వేదికపై కోవూరు నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలు, నాయకులతో జరిగే సమన్వయ సమావేశంలో పాల్గొని దిశానిర్దేశం చేస్తారు. ఈ పర్యటనకు సంబంధించి

58 యుద్ధాల ప్రభావం

850 కోట్ల మందిపై పడింది: కేఏ పాల్

అమరావతి, సెప్టెంబర్ 15 : ప్రపంచవ్యాప్తంగా సాగుతున్న యుద్ధాల కారణంగా నిత్యావసర వస్తువులు, ఇంధన ధరలు నియంత్రణ లేకుండా పెరిగిపోతుండటంపై ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు ప్రపంచంలో జరిగిన వివిధ 58 యుద్ధాల ప్రభావం దాదాపు 200 దేశాలలోని 850 కోట్ల మంది ప్రజలపై తీవ్రంగా పడిందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా ఈ ఏడాది ఫిబ్రవరి చివరి నుంచి ప్రారంభమై ఆరు నెలలుగా కొనసాగుతున్న అమెరికా - ఇరాన్ సైనిక ఉద్రిక్తతల వల్ల అంతర్జాతీయ సరఫరా వ్యవస్థ దెబ్బతిని, సామాన్యుడికి నిత్యావసరాలు అందని ద్రాక్షగా మారాయని అన్నారు. మార్కెట్లో రూ. 100 ఉండే వస్తువుల ధరలు రూ. 200 నుండి రూ. 300 వరకు పెరిగాయని, లీటర్ పెట్రోల్, గ్యాస్ ధరలు 2 డాలర్ల నుండి ఏకంగా 4 నుండి 5 డాలర్లకు పైగా భారమయ్యాయని లెక్కలతో వివరించారు. ధనిక వర్గాలకు దీనివల్ల పెద్దగా ఇబ్బంది లేకపోయినప్పటికీ, సమాజంలో ఉన్న 90 శాతం పేద, మధ్యతరగతి ప్రజలు ఈ ద్రవ్యోల్బణంతో అల్లాడిపోతున్నారని చెప్పారు.

ఆధ్యాత్మిక శోభతో టీడీపీ శ్రేణుల పరవశం

- 450 మంది టీడీపీ కార్యకర్తలతో శ్రీశైలం యాత్ర - భ్రమరాంబ మల్లికార్జున స్వామివారిని దర్శించుకున్న గళ్ళా మాధవి దంపతులు - టీడీపీ శ్రేణులకు సాదర స్వాగతం పలికిన బోడెపూడి వెంకట సుబ్బారావు
- దర్శన ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించిన దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యుడు
- కార్యకర్తల కృషిని గుర్తించి ప్రత్యేక పర్యటన ఏర్పాటు
- వెలిగొండ ప్రాజెక్టు సందర్శనతో పాటు శ్రీశైలం దర్శనం

శ్రీశైలం, అక్షర ప్రకాశం : గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి, రామచంద్రరావు దంపతుల ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు శ్రీశైలం క్షేత్రాన్ని సందర్శించారు. సుమారు 450 మంది పార్టీ శ్రేణులు యాత్రలో పాల్గొని శ్రీ భ్రమ రాంబ మల్లికార్జున స్వామివారిని దర్శించుకున్నారు. నిత్యం రాజ కీయ, ప్రజా కార్యక్రమాల్లో నిమగ్నమై ఉండే టీడీపీ శ్రేణులు గళ్ళా మాధవి దంపతులతో కలిసి ఆధ్యాత్మిక వాతావరణంలో కొంతసేపు సేదతీరారు. శివనామస్మరణతో శ్రీశైలం ఆలయ పరిసరాలు మార్మోగాయి. ఎమ్మెల్యే గళ్ళా మాధవి, రామచంద్రరావు దంపతు లతో పాటు గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి వచ్చిన టీడీపీ నాయకులు, కార్యకర్తలకు శ్రీశైలం దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యుడు బోడెపూడి వెంకట సుబ్బారావు సాదర స్వాగతం పలికారు. అనంతరం దేవస్థానం అధికారులతో సమన్వయం చేసుకుని సుమారు 450 మంది కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దర్శన ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు. క్యూలైన్లు, ఇతర ఆలయ సంబంధిత ఏర్పాట్లను పరిశీలించి ప్రోటోకాల్ దర్శనానికి ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యే దంపతులు స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారిని ఘనంగా సన్మానించారు. పార్టీ పిలుపునందుకుని ఇంటింటికీ కార్యక్రమంలో ముందుండి పనిచేసిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను గుర్తించి ప్రత్యేకంగా పర్యటన ఏర్పాటు చేయడం అభినందనీయమని బోడెపూడి వెంకట సుబ్బారావు అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా పూర్తి చేసిన రాయలసీమ, ప్రకాశం జిల్లాల ప్రజల కలల వారధి వెలిగొండ ప్రాజెక్టును కార్యకర్తలకు స్వయంగా చూపించడంతోపాటు, అనంతరం శ్రీశైలం మల్లికార్జున స్వామివారి దర్శనానికి తీసుకురావడం వినూత్న కార్యక్రమమని పేర్కొన్నారు. కార్యకర్తల కృషిని గుర్తించి ఇలాంటి అవకాశాలు కల్పించడం ద్వారా పార్టీ శ్రేణుల్లో మరింత స్ఫూర్తి, ఉత్సాహం పెరుగుతుందని ఆయన అన్నారు. శ్రీశైలంలో స్వాగతం, వసతి, దర్శనం, ప్రత్యేక పూజలు తదితర ఏర్పాట్లను బోడెపూడి వెంకట సుబ్బారావు దగ్గరుండి పర్యవేక్షించడంతో గళ్ళా మాధవి దంపతులతో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు అభినందనలు తెలిపారు. మొత్తం యాత్ర ఆధ్యాత్మిక శోభతో, భక్తిశ్రద్ధలతో సాగింది.

క్వీస్ కళాశాలలో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్

- విద్యార్థుల వినూత్న ఆవిష్కరణలకు వేదిక
- జాతీయస్థాయి పోటీకి 45 బృందాలు ఎంపిక

ఒంగోలు, అక్షర ప్రకాశం : విద్యార్థుల్లో నూతన ఆలోచనలు, సృజనాత్మకత, సాంకేతిక పరిజ్ఞానంతో సమస్యలను పరిష్కరించే సామర్థ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో ఒంగోలులోని క్వీస్ కళాశాల ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్-2026 అంతర్గత పోటీలను నిర్వహించారు.

కళాశాలలోని రామానుజన్ సదస్సు మందిరంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు 17 విభిన్న అంశాలకు సంబంధించిన సమస్యలకు వినూత్న పరిష్కారాలను రూపొందించి ప్రదర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన స్వయంచాలక సాంకేతికత, దేహదారుఢ్యం-క్రీడలు, వారసత్వం-సంస్కృతి, వ్యవసాయం-ఆహార సాంకేతికత, వైద్య-జీవ సాంకేతికత, ఆరోగ్య సాంకేతికత, స్మార్ట్ వాహనాలు, రోబోటిక్స్-డ్రోన్లు, పర్యాటకం, బ్లాక్‌చెయిన్-సైబర్ భద్రత, స్మార్ట్ విద్య, రవాణా-సరఫరా నిర్వహణ తదితర అంశాలపై సమస్యలను ప్రతిపాదించారు. వాటికి పరిష్కారాలను కనుగొనే దిశగా విద్యార్థులు వివిధ ప్రాజెక్టులను రూపొందించి ప్రదర్శించారు. ఈ అంతర్గత హ్యాకథాన్‌లో సుమారు 128 బృందాలు పాల్గొని తమ ప్రాజెక్టులను ప్రదర్శించాయి. ఇందులో 42 హార్డ్‌వేర్ ప్రాజెక్టులు, 86 సాఫ్ట్‌వేర్ ప్రాజెక్టులను విద్యార్థులు అభివృద్ధి చేశారు. ప్రతిభ కనబరిచిన బృందాల్లో 45 బృందాలను జాతీయస్థాయి స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ పోటీకి ఎంపిక చేసినట్లు విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, కార్యనిర్వాహక ఉపాధ్యక్షురాలు డాక్టర్ గాయత్రిదేవి తెలిపారు. ప్రాజెక్టుల రూపకల్పనలో క్వీస్ కళాశాల విద్యార్థులు ఎప్పుడూ ముందుంటారని వారు పేర్కొన్నారు. విద్యార్థులకు ప్రాజెక్టుల రూపకల్పనపై ప్రత్యేక శిక్షణ అందించడం కళాశాల ప్రత్యేకతగా తెలిపారు. ఆవిష్కరణలు, సృజనాత్మక ఆలోచనలను ప్రోత్సహించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.వి. హనుమంతరావు, విద్యా వ్యవహారాల విభాగం డీన్ డాక్టర్ సత్యమేహర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆలోచన-ఆవిష్కరణ విభాగాధిపతి, స్మార్ట్ ఇండియా హ్యాకథాన్-2026 అంతర్గత పోటీల సమన్వయకర్త డాక్టర్ ఎం. గుణ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. పరిశోధన-అభివృద్ధి విభాగం డీన్ డాక్టర్ కేవీజే భార్గవ్‌తో పాటు వివిధ విభాగాల డీన్లు, విభాగాధిపతులు, డైరెక్టర్లు, న్యాయనిర్ణేతలు, అధ్యాపకులు, మార్గదర్శకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఇంజినీర్స్ డే వేడుకలు

- విశ్వేశ్వరయ్య సేవలు, ఆవిష్కరణలు స్ఫూర్తిదాయకం

- పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

ఒంగోలు, అక్షర ప్రకాశం : నగరంలోని క్విస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్యభట్ట సదస్సు మందిరంలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.వి. హనుమంతరావు మాట్లాడుతూ.. మోక్షగుండం విశ్వేశ్వరయ్య దేశ అభివృద్ధికి చేసిన సేవలు, ఆయన చేపట్టిన నిర్మాణాలు, ఆవిష్కరణల గురించి విద్యార్థులకు వివరించారు. ఇంజినీరింగ్ రంగంలో ఆయన చేసిన కృషి నేటి తరానికి, ముఖ్యంగా విద్యార్థులకు ఎంతో

స్ఫూర్తిదాయకమని అన్నారు. సమాజాభివృద్ధికి ఉపయోగపడే నూతన ఆలోచనలు, ఆవిష్కరణలపై విద్యార్థులు దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులకు

విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, కార్యనిర్వాహక ఉపాధ్యక్షురాలు డాక్టర్ శ్రీ గాయత్రిదేవి ఇంజినీర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ కల్యాణి పర్యవేక్షించారు. వివిధ విభాగాల విభాగాధిపతులు, డీన్లు, డైరెక్టర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోరు ఉప్పలపాడు విద్యార్థులకు హెచ్ఐవీ-ఎయిడ్స్‌పై అవగాహన

కొండపి, అక్షర ప్రకాశం : మాదక ద్రవ్యాలు, హెచ్ఐవీ-ఎయిడ్స్ పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని వక్తలు సూచించారు. ప్రకాశం జిల్లా కొండపి మండలం కోరు ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కళాశాలలో మంగళవారం హెచ్ఐవీ-ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి. సుసన్నకుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు హెచ్ఐవీ-ఎయిడ్స్ వ్యాప్తి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాలకు, ఇతర వ్యసనాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. విలువైన జీవితాన్ని వ్యసనాల కారణంగా నష్టపోవద్దని అన్నారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా శిక్షణ కమిషనర్ (స్కౌట్స్) కొణిజేటి వెంకట శేషారావు మాట్లాడుతూ.. యువత తాత్కాలిక ప్రలోభాలకు లోనుకాకుండా లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలని కోరారు. సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని, మాదక ద్రవ్యాలు, ఎయిడ్స్‌కు దూరంగా ఉంటూ దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కొంగర శ్రీనివాసరావు, కొప్పోలు భాను ప్రకాష్, దిశా ఫౌండేషన్ క్లస్టర్ ఇన్‌చార్జి సత్యవతి, పాఠశాల ఏఎన్ఎం అనంతలక్ష్మి పాల్గొన్నారు. నేతాజీ స్కౌట్ విద్యార్థులతో పాటు పాఠశాల, కళాశాల విద్యార్థులు మాదక ద్రవ్యాలకు, హెచ్ఐవీ-ఎయిడ్స్‌కు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు.

ఘనంగా ఇంజినీర్స్ డే వేడుకలు

- సమాజ అభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర కీలకం

- నైపుణ్యాలు పెంచుకుని సవాళ్లను అధిగమించాలి

- 3నూతన ఆవిష్కరణలపై విద్యార్థులు దృష్టి సారించాలి

- ఇంజినీరింగ్ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం

- ఘనంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి వేడుకలు

చీరాల, అక్షర ప్రకాశం : సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో ఇంజినీర్స్ డే వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని కళాశాల ఐ.ఎస్.టి. విద్యార్థుల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. జగదీశ్‌బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ విద్య ద్వారా సమాజానికి ఉపయోగపడే సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయాలని విద్యార్థులకు సూచించారు. ప్రతి ఇంజినీర్ తన నైపుణ్యాలను పెంపొందించుకుని, ఎదురయ్యే సవాళ్లను సమర్థంగా అధిగమిస్తూ సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. కళాశాల డైరెక్టర్ (అక్రిడిటేషన్స్) డా. సి. సుబ్బారావు మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ విద్యార్థులు పరిశోధనాత్మక దృక్పథాన్ని అలవర్చుకోవాలని, సమాజ అవసరాలకు అనుగుణంగా నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని అన్నారు. ఇంజినీర్స్ డే సందర్భంగా కళాశాలలోని వివిధ విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించిన పలు పోటీల్లో విజేతలైన విద్యార్థులకు కళాశాల కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు, డా. సి. సుబ్బారావు, ప్రిన్సిపాల్, మేనేజర్ (అడ్మినిస్ట్రేషన్) ఆర్.వి. రమణమూర్తి, డైరెక్టర్ (అడ్మినిస్ట్రేషన్) వనమా దొర నాగ సాయినాథ్ తదితరులు బహుమతులు అందజేశారు. కళాశాల సెక్రటరీ డా. పి.వి.ఎస్. శర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విఘ్నేశ్వరుని నవరాత్రి ఉత్సవాలు

- వీధి వీధినా కొలువుదీరిన గణనాథుడు
- వినూత్న ప్రతిమలతో ప్రత్యేక ఆకర్షణ
- పెన్నుల గణపతికి విశేష ఆదరణ
- పంచముఖ గణపతికి భక్తుల సందడి
- ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి
- కుటుంబ సమేతంగా తరలివస్తున్న భక్తులు

ఒంగోలు, అక్షర ప్రకాశం : ఒంగోలు నగరంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా ప్రారంభమయ్యాయి. వీధి వీధిలో గణపతి మండపాలు వెలసి, ప్రత్యేక అలంకరణలు, విద్యుత్ దీపాలతో పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. భక్తుల రాకతో సందులన్నీ సందడిగా మారాయి. ఈ ఏడాది ఉత్సవాల్లో భారీ విగ్రహాలతో పాటు వినూత్నంగా, సృజనాత్మకంగా రూపొందించిన గణపతి ప్రతిమలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. దక్షిణం బజారులో పెన్నులతో తయారు చేసిన పెన్నుల గణపతి విద్యార్థులు, ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటోంది. రంగుతోటలో తల్లిదండ్రులైన శివపార్వతుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నట్లుగా రూపొందించిన గణపతి ప్రతిమ భక్తులను ఆకర్షిస్తోంది. గ్రంథాలయం వద్ద ఏర్పాటు చేసిన పంచముఖ గణపతి అభయమిస్తున్నట్లుగా దర్శనమిస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మాతా శిశు వైద్యశాల ఎదుట ఏర్పాటు చేసిన ఆలయ తరహా మండపం కన్నులపండువగా ఉంది. తాబేలుపై ఆసీనుడైన గణపతి, ప్రకృతి సందేశాన్ని చాటే వృక్ష గణపతి తదితర విభిన్న రూపాల్లో లంబోదరుడు భక్తులకు దర్శనమిస్తున్నాడు. మండపాల్లో పురోహితుల వేద మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. దీప కాంతులు, విద్యుత్ దీపాలంకరణలతో మండ పాలు దగదగలాడుతున్నాయి. భక్తిగీతాలాపనలు, పురాణ ప్రవచనాలు, కూచిపూడి నృత్య ప్రదర్శనలు నిర్వహిస్తూ భక్తులను అలరిస్తున్నారు. మహిళల ప్రత్యేక అలంకరణలు, యువత కేరింతలు, కోలాటాలతో ఉత్సవ పరిసరాలు సందడిగా మారాయి. విఘ్నేశ్వరుడిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకునేందుకు కుటుంబ సమేతంగా భక్తులు తండోపతండాలుగా తరలివస్తున్నారు. దీంతో నగరంలో ఎటుచూసినా గణనాథుని నామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

Published by : Byrapuneni Srinivasarao, Door No.2-25, Vinodarayanipalem (v), Ammanabrolu (Post), N.G.Padu Mandal, Prakasam Dist. A.P. , Printed by : Nannuri Subba Rao, Trunk Road, Ongole Town & Mandal, Prakasam Dist, A.P. - 523001, Printed at : Vijaya Printers (offset Printing), Trunk Road, Ongole Town & Mandal, Prakasam Dist, A.P. - 523001, Published from : Door No.2-25, Vinodarayanipalem (v), Ammanabrolu (Post), N.G.Padu Mandal, Prakasam Dist. A.P. Editor : Byrapuneni Srinivasarao, Door No.2-25, Vinodarayanipalem (v), Ammanabrolu (Post), N.G.Padu Mandal, Prakasam Dist. A.P. Cell : 9848997263, E.mail : aksharaprakasam@gmail.com,